# అమ్మ, అర్ధాంగి

దివాధిపతి దుర్గాన్ని ముట్టడించ డానికి నిశిరాజు సేనలు పశ్చిమ దిశను పొంచి ఉన్నాయి. పశ్చిమ ప్రాకారంపై పహరా కాస్తున్న సాంధ్యుడు ఈ కబురు దివాణానికి చేరవేశాడు. క్రుద్ధుడైన దివాధిపతి శత్రురాజు సైనిక శిబిరంపై ఒక పెద్ద కాగడాని విసిరిం చాడు. శత్రుసేనల శిబిరానికి నిప్పంటు కుని అవి ధగద్ధగాయమానంగా తగలబడి పోతున్నాయి. పడమటి దిక్కంతా ఆకాశ మంత ఎత్తున ఎర్రగాపురు కమ్మింది!

ఆ సమయంలో ఇల్లు చేరుకున్నాడు రామచంద్ర, రోజువారీ వేళకన్నా కొంత ఆలస్యంగా.

సైకిలు ముందు చక్రంతో ప్రహరీ గేటుని ముందుకి తోస్తూ పక్కకి చూశాడు— విశ్వనాథంగారు ఇంకా తన కోసం ఎదురు చూస్తూ కూర్చున్నారో, ఇంట్లోకి వెళ్ళిపోయారో అని.

విశ్వనాథంగారు వెళ్ళిపోలేదు. అక్కడే కూర్చుని ఉన్నారు. కాని, తను గేటు తీసుకొని వస్తున్నప్పుడుకూడా వినిపించ నంతటి ఏకాగ్రంగా ఏదో ఆలోచనలో నిమగ్నులై ఉన్నారు.

ఆయన ఉన్న తీరు కొత్తగా, వింతగా అనిపిస్తూ ఉంటే బట్టలు మార్చుకు రావటానికి లోనికి వెళ్ళాడు రామచంద్ర.

రామచంద్ర, విశ్వనాథంగారి ఇంటి రెండవ భాగంలో అద్దెకి ఉంటున్నాడు. అతనికి బాంకులో ఉద్యోగం. ఈ ఊరికి బదిలీ అయి వచ్చి కొద్ది వారాలే అయింది.

విశ్వనాథంగారు పదవీ విరమణ చేసిన ప్రభుత్వోద్యోగి. పిల్లలు వేరే ప్రదేశాల్లో ఉద్యోగాలు చేసుకుంటున్నందువల్ల దంపతులు ఇద్దరూ ఉంటున్నారు ఇంట్లో.

విశ్వనాథంగారిది విశాలమైన స్థలంలో కట్టిన డాబా ఇల్లు. చుట్టూ ప్రహరీగోడ, ఆవరణలో అక్కడక్కడా కొబ్బరిచెట్లు, ఫలవృక్షాలు. పూలచెట్లతో పాటు చల్లని గాలి నిచ్చే ఒక పెద్ద వేపచెట్టు ఇంటి ముందుభాగానికి ఎదురుగా, ప్రహరీ గోడకి దగ్గరగా ఉంది.

ఇంట్లో చేరిన కొద్ది రోజులకే రామచంద్ర, విశ్వనాథంగారు స్నేహితు లయారు. రామచంద్రకి సాయంత్రం డ్యూటీ కాగానే మరెక్కడికీ వెళ్ళే అలవాటు లేదు. తిన్నగా ఇంటికే వచ్చి కాఫీ సేవించి, పుస్తకాలతో కాలక్షేపం చేస్తాడు. విశ్వనాథంగారికి చదరంగం ఆటంటే ప్రాణం. కాలం గడవక ఎవరు చిక్కితే వాళ్ళతో ఆ ఆట వేసుకు కూర్చుంటాడు. రామచంద్రకి కూడా ఆ ఆటమీద అభిరుచి ఉండటంతో ఇక అతన్ని వదిలి పెట్టలేదు. రామచంద్ర ఇంటికి వచ్చి కాఫీ, స్నానం ముగించగానే చల్లటి ఆ వేపచెట్టు నీడన ఓ గంట చదరంగం ఆడటం ఇద్దరికీ దినచర్య అయింది.

"క్షమించాలి, మాస్టారూ!" బట్టలు మార్చుకొని వచ్చిన రామచంద్ర పలకరిం చాడు.

అతని రాకకూడా గమనించని విశ్వనాథంగారు ఉలిక్కి పడినట్టయి, "ఆఁ వచ్చావా! కూర్చో" అని ఓ దరహాసం జారవిడిచాడు. కాని, రోజూ ఉండే అట్టహాసం, ఉల్లాసం ఆయన ముఖంలో ప్రస్ఫుటం కాలేదు.

రామచంద్ర కుర్చీలో కూర్చుంటూ, "ఈవేళ ఓవర్‌టైం చేయవలసింది వచ్చింది, మాస్టారూ! ఇంకో రెండు రోజులుకూడా ఉండచ్చు. ఇందాకట్నుంచీ నా కోసం ఎదురు చూస్తూ కూర్చున్న ట్టున్నారు. ముందుగా తెలియక పోవటం వల్ల మీకు ఇబ్బంది కలిగించాను!" అని తన ఆలస్యానికి కారణం వివరిస్తూనే, ఆయనకి కలిగించిన అసౌకర్యం పట్ల సానుభూతిని వ్యక్తం చేశాడు.

విశ్వనాథంగారు— "పర్వాలేదులే నోయ్" అన్నారే గాని, పరధ్యానపు ఛాయలు ఆయనను ఇంకా విడిచి పెట్ట లేదు.

అంతటి దీర్ఘాలోచనకి కారణం ఏమై ఉంటుందో తెలుసుకోవాలని— "ఏమిటి, మాస్టారూ, మీరివేళెందుకో పరధ్యా నంగా ఉన్నారు? దేన్ని గురించో దీర్ఘంగా ఆలోచిస్తున్నారు?" అని ప్రశ్నించాడు రామచంద్ర.

విశ్వనాథంగారు వెంటనే సమాధానం ఇవ్వలేదు. ఆలోచనల తాలూకు తరంగాలు మరోసారి ఆయన ముఖంలో తరలించాయి.

రామచంద్ర ముఖంలోకి సాలోచనగా చూసి, "ఆఁ ఏమీ లేదు" అని ఏదో చెప్పబోతున్న వారల్లా, అంతలోనే వాళ్ళ పక్కింటిలో చెలరేగిన అలజడిని విని, "అటు విను!" అని ఆ వైపు చూపిం చారు.

ఆ ఇంటాయనవిలా ఉన్నాయి కేకలు, రంకెలు! ఆ ఇల్లాలివేమో— ఏడుపులు, పెడబొబ్బలు! మరో పెద్దావిడ రోదనలు, శాపనార్థాలు!

**ఆర్. కె. కటారి**

"గంట క్రితంనించీ ఈ గోల! ఇంతకి ముందే కాస్త సద్దు మణిగింది. మళ్ళీ మొదలు!"

"ఏమిటో ఆ గొడవ?"

"ఏముంటుంది! అత్తా కోడళ్ళ పగ, మధ్య మగవాడికి సెగ!"

నిట్టూర్చాడు రామచంద్ర.

"ఏదున్నా లేకపోయినా ఇదుంటే ఇల్లు నరకమేనోయ్! చీటికి మాటికి తగాదాలు పెట్టుకొనే ఆ ఆడాళ్ళ మనసు లెలా ఉంటాయో గాని, వాళ్ళిద్దరి మధ్యా చిక్కుకున్న మగాడి మనసు మాత్రం మరలో పెట్టిన చెరకుగడలా నలిగి పిప్పి కావటం ఖాయం! భర్త గొప్పవాడవటానికిభార్య కారకురాలంటారే — అందులో ఏ మాత్రం సందేహం లేదు. ఇంట్లో శాంతి లేని మగాడు ఇంకో ఏదీ సాధించలేడు!"

అవి జీవితాన్ని కాచి వడపోసిన మాట లనిపించాయి. ఆయన ముఖంలో అటు వంటి జీవితం పట్ల ఉన్న చికాకు చిక్కగా ద్యోతకమయింది. అందుచేత ఆయన ముఖంలోకి సందేహాత్మకంగా చూశాడు రామచంద్ర— 'ఈయన జీవితంలో కూడా పొరపొచ్చా లున్నాయా?' అను కుంటూ.

కాని, అతనికి సందేహ నివృత్తి గావిస్తూ సాగిపోయింది విశ్వనాథంగారి వివరణ.

"పుణ్యం కొద్దీ పురుషు డంటారు గాని, సుకృతాన్ని బట్టే స్త్రీకూడా! సంసారం సుఖశాంతులతో వర్ధిల్లాలంటే అందుకు స్త్రీయే మూల కారణం. అనుకూలవతియైన భార్య లభించటం నిజంగా పూర్వజన్మ సుకృతమే! కాకుంటే కాపరాల్లో ఇన్ని కలతలే ఉండవు. నా కుటుంబం అలాంటిది కానందుకు నే నెప్పుడూ భగవంతుణ్ణి కృతజ్ఞతతో కీర్తి స్తుంటాను. చాలా కాలానికి మీ చక్కని దాంపత్యంతో మాకు సాన్నిహిత్యం ఏర్పడి నందుకుకూడా సంతోషిస్తున్నాను!"

రామచంద్రకి ఒక సంశయం తీరి మరో సంశయమేదో పట్టుకున్నట్టుగా ఆయన ముఖంలోకి అనుమానంగా చూశాడు. విశ్వనాథంగారు అది గమనించి చెప్పసాగారు.

"అనుభవం లేని నేను కుటుంబపు కలతల్ని గురించి ఎలా చెప్పగలుగుతున్నా నని కదూ నీ అనుమానం? స్వానుభవం కాదు గాని, సాక్షిగా అనుభవం ఉంది. అదిగో, ఆ గొడవ నా చెవిని పడగానే ఒక నాటి నా మిత్రుడి దుఃఖభాజనమైన కుటుంబగాథ గుర్తుకొచ్చి అది నెమరేసు కుంటూఉండిపోయానునువ్వొచ్చినప్పుడు. అదే నా పరధ్యానానికి కారణం!"

"ఆ కథ నేను తెలుసుకోవచ్చా?"

"నీకు తెలుసుకోవాలనుంటే, తప్పకుండా!"

"చెప్పండి. పెద్దల అనుభవాలే కదా పిన్నలకి మార్గదర్శకాలు!"

విశ్వనాథంగారు చదరంగం అట్ట మడిచి పెట్టి, పావులన్నీ అట్ట పెట్టెలో పడవేసి, వాటి నన్నిటినీ ఒక పక్కను పెట్టి ప్రారంభించారు.

"అప్పట్లో నీవయస్సేఉండి ఉంటుంది నాకు. ఇక్కడే పని చేస్తుండేవాడిని. మా ఆఫీసుకి నా కాడర్‌కి చెందినవాడే ఒకతను వేరే ఊరి నించి ట్రాన్స్ఫరయి వచ్చాడు. అతని అలవాట్లు, గుణగణాలు నాకు బాగా నచ్చాయి. కొద్ది రోజుల్లోనే ఇద్దరం ప్రియస్నేహితుల మయ్యాం.

ఒక రోజు జరిగిన విశేషంతో అత నంటే నాకు మరింత ఇష్టం ఏర్పడింది.

ఆ వారం వచ్చిన పత్రికలో కథల పోటీలో ప్రథమ బహుమతి పొందిన అతని ఫొటో చూసి నివ్వెరపోయాను. ఎంత గుంభనపు మనిషి! ఆ వార్త వినగానే ఎవరైనా సహజంగా పది మందికీ చెప్పు కుంటారు. కొందరైతే ముందుగానే సన్మానాలు పొందుతారుకూడా. అటు వంటిది, ఇతను మా మధ్య మంచి స్నేహం ఏర్పడికూడా తను రచయితనని చెప్పకుంటే మానె— ఇంతటి గొప్ప విషయం జరిగినాకూడా బయట పడ లేదు.

అత న్నభినందిస్తూనే నా మాటే అడిగాను. అతను నవ్వేసి 'పత్రికలో పడ్డప్పుడు ఎలాగూ తెలిసేదే! ఈ మాత్రానికి ముందుగానే టాంటాం దేనికి? ఏమిటో ప్రచారమంటే నాకు గిట్టదండీ' అని ఇబ్బందిగా ముఖం పెట్టాడు.

అతని నిరాడంబరత, వినయశీలత నన్నింకా అధికంగా ఆకట్టుకున్నాయి. అతని స్నేహాన్ని నేను గాఢంగా వాంఛిం చాను.

ఆ రోజుల్లోనే ఈ ఇంటి నిర్మాణం

పూర్తయింది. మాకు ఊళ్ళో పాత ఇళ్లొకటి ఉన్నా మంచి గాలి, వెలుతురుల కోసమని, ప్రశాంతంగా ఉంటుందని, ఆధునిక సౌకర్యాలతో అప్పట్లో ఊరికి కడగా ఉన్న ఈ చోట్లో ఇల్లు కట్టాం. ఈ సంఘటన జరిగిన వారం రోజులకే గృహప్రవేశంకూడా జరిగింది.

గృహప్రవేశోత్సవానికి మా ఆఫీసు వాళ్ళందర్నీ ఆహ్వానించాము. భోజనా లయాక అందరూ వెళ్ళిపోతుంటే అతణ్ణి మాత్రం ఆపాము కొంత సేపు ఉండి పొమ్మని.

ఇల్లంతా ఒకసారి చుట్టూ తీసుకెళ్ళి చూపించాక, ఈ చెట్టు కిందే కూర్చున్నాం పిచ్చాపాటీ వేసుకుని. అతను ఈ ఇంటిని, ఏకాంత ప్రదేశాన్ని ఎంతో ప్రీతిగా మెచ్చుకున్నాడు. అప్పుడు గుర్తొచ్చింది నాకు అతను మంచి ఇల్లేదన్నా ఉంటే చూసి పెట్టమని అడగటం.

రెండో భాగం ఎలాగూ అద్దె కివ్వా లనుకుంటున్నాం గనక అందులో అతను చేరితే అతని ఉద్దేశాలకి అనుగుణంగా ఉంటుందని, నా కిష్టమైన స్నేహితుడు నా దగ్గిరే ఉంటాడని ఇక్కడి కొచ్చి చేరమని కోరాను.

ఆ మాట వింటూనే అతను 'అమ్మో! ఈ ఇల్లే!' అని ఆశ్చర్యం ప్రకటించాడు. అంటే అద్దె ఎక్కువ ఉంటుందని. కాని నేను పట్టుబట్టి తనకి ఓపినంతే ఇవ్వచ్చుని నచ్చ చెప్పి ఈ ఇంట్లో చేర్పించాను.

ఆ విధంగా అతను నా సహవాసికూడా అయ్యాడు.

అతని కుటుంబంలో అతను కాక మరో ముగ్గురే సభ్యులు అప్పట్లో — భార్య, తల్లి, నెలల పిల్లవాడు. ఇంట్లో చేరిన రెండు మూడు వారాల దాకా వాళ్ళు, మేము కలగలుపుగా ఉన్నాము. కాలం ఉల్లాసభరితంగా గడిచిపోయింది. ఆ తరవాతే ఈ కథకి నాంది ప్రస్తావన జరిగింది.

ఒక రోజున మేమిద్దరం రోజుకి మల్లే మధ్యాహ్న భోజనానికి ఇంటి కొచ్చాం. గేటు దాటి లోపలి కడుగు పెడుతూనే వాళ్ళ వాటాలో నుండి అతని భార్య, తల్లి పెద్ద పెద్దగా కేకలు వేసుకోవటం వినిపించింది. ప్రశ్నార్థకంగా అతని ముఖంలోకి చూశాను. అతని ముఖం చిన్నబోయి, నల్లగా మాడిపోయి ఉంది. మౌనంగా ఎవరి వాటాలోకి వాళ్ళు నడిచాం."

* * *

వెంకట్రావు ప్రాణం చచ్చిపోతూంది. 'తన కర్మ కాకపోతే ఈ పోరు మళ్ళీ ప్రారంభం కావాలా? తన వెంతో గౌరవంగా, ఆత్మీయంగా చూసుకుంటున్న విశ్వనాథానికికూడా తన బ్రతుకులో వెలితి తెలిసిపోవాలా?'

కోపాన్ని దిగమింగుకుంటూ గడపలో కాలు పెట్టాడు. అతన్ని చూసి ఇద్దరూ మాటలు కట్టి పెట్టారు. ఎలాగూ ఆపేశారు గనక మళ్ళీ తను కల్పించుకోవటం ఎందుకని గమ్మున ఊరుకున్నాడు.

కాని, ఆ అగ్గి చల్లారలేదు! మళ్ళీ రాజుకుంది.

జానకి భర్తకి అన్నం వడ్డించి కళ్ళొత్తుకుంది.

"ఈ బ్రతుకు బతక్క పోతేనేం! ఇంత చాకిరీ చేస్తూ బతికినంత కాలం ఇన్నిన్ని మాటలు పడవలసిన ఖర్మేందుకు నాకు? చుట్టుపక్కల ఇంకెవరి కైనా ఉందా? పాడుబతుకు — చావైనా రాలేదు!"

వెంకట్రావుకి కడుపు రగులుతూంది. కాని, తమాయించుకున్నాడు.

"నోటి కెంత వస్తే అంతా అనేయటమే! నే నేం కానిపని చేస్తున్నానని అంత నీచంగా మాట్లాడాలి? అంత నీచురాల్నా నేను? మొగుడికి అన్నీ నేర్పి తనకి కాకుండా చేస్తున్నానా? నా మాట వినే తనతో సరిగా మాట్లాట్టం లేదా మీరు? తన వాళ్ళకి పెడితే ఏడ్చి చస్తున్నానా నేను? ఏం మాటలివన్నీ? ఛీ ఛీ! ఇంతకన్నా ఏ నుయ్యో గొయ్యో చూసుకోవటం మేలు!"

జానకికి దుఃఖం పెల్లుబికింది. మోకాళ్ళపైన తల ఆన్చి సన్నగా ఏడవ సాగింది.

వెంకట్రావు ఏమన్నా సహించగలడు గాని, తను భార్య మాట వినే వాడంటే మాత్రం తట్టుకోలేడు! అసహనంగా 'అమ్మా!' అని తల్లిని పిలిచాడు. రుక్మిణమ్మ గడప దగ్గిరికి వచ్చి నిలబడింది.

"ఏమమ్మా! ఆ మాట అన్నావా నువ్వు?" అడిగాడు తల్లిని.

"అయ్యో, రాత! నే నలా ఎప్పు డన్నాను?"

"చూశారా, చూశారా! అనీ అనలేదని ఎలా బుకాయిస్తోందో!" తక్కువ అందుకుంది జానకి.

"నేనా బుకాయించేది, అబద్ధాలాడేది? అడగవలసిన మాటలన్నీ అడిగి ఏమీ నేరని దానిలా నంగనాచి ఏడుపు ఏడవడం నా వల్లగాదే! మగవాడు ఇంటి కొచ్చి రాగానే ఇలా మారిపోస్తారా ఎవరైనా?"

"చూశారా? మళ్ళీ అదే మాట! ఇంకెలా వండి చచ్చేది? జరిగింది చెప్పుకోవటంకూడా నూరి పోయుట మేనా?"

"అవునే! ఆడవాళ్ళం లక్ష అనుకుంటాం! అయితే మాత్రం — అవన్నీ మగవాడు గడపలో కాలు పెట్టే పెట్టక ముందే తగుదునమ్మా అని దండకం చదువుతారా?"

"ఆహా! చదవటమెందుకు? నీ నోటి కొచ్చినట్టల్లా తిట్టి పోస్తుంటే పడుండటానికి నే నేం నీ దాసీదాన్ని కాదు!"

"అవును. పెద్దంతరం చిన్నంతరం లేకుండా ఎదురు సవాళ్ళు పలికే దానివి ను వ్వెందుకు పడతావు! ఏదో పెద్దదాన్నంటూ ఉన్నా గనక, ఏది వూసినా మండిపోయే రోజులు గనక కాస్త జాగర్తగా చేసుకోండమ్మా అని చెబుతాను అదైనా మీ మంచికోసమేగా? నే నేమన్నా కట్టుకు పోతానా, ఏం? ఆ మాత్రం చెప్ప దగనా నేను? ఆమాత్రానికే అంత లావు కోపాలు రావాలా?"

"అదుగో! అదేమంటె ఇదొకటి! నేను కాపరాన్ని గుల్ల చేస్తున్నానట! నెల రోజుల కొచ్చే వెచ్చాలు పది రోజులకే పట్టపగలుగా చేస్తున్నానట. ఏం చేసినా, ఎంత చేసినా ఇంట్లో ఉన్న మనుషులకే గాని నా ఎదాన కొట్టుకుంటున్నానా లేక నా పుట్టింటికి పంపుతున్నానా? నా కా మాత్రం జ్ఞానం లేదూ? నే నెందుకు దుబారా చేస్తాను? మనుషులంటూ ఉన్నాక ఖర్చుగాకుండా ఎలా ఉంటుంది?"

"అవునే! నీ కళ్ళకి నే నొక్కదాన్ని ఎక్కువగా కనిపిస్తున్నాను! నేను తినిపోతున్నా ననేగా నీ ఏడుపంతా! నన్ను సాగనంపాలనేగా నీ కోరిక! పోతానే! పోక నీ చేతి ముద్ద కోసం కాసుకు కూర్చున్నా ననుకుంటున్నావా? నేను తినే పిడికెడు మెతుకులు ఏ అమ్మకాడికి పోయినా పెట్టక పోదులే!"

తల తిరిగి పోతూంది వెంకట్రావుకి. ఇక ఈ ధోరణికి అంతూ పంతూ ఉండదు, అడ్డుకోకపోతే. ఒకరి నెపాన్ని ఒకరు ఒప్పుకోరు. ఒకరు చెప్పేది ఇంకొకరు అబద్ధ మంటారు. తను లేనప్పుడు తీరి కూర్చుని తగాదా పెట్టుకుంటారు. ఎలా పరిష్కరించాలో అర్థం కాదు! పిల్ల తగాదాలతో తనకి మనశ్శాంతి లేకుండా పోతూంది!

"అమ్మా!" అన్నాడు కాస్త బిగ్గరగా. మళ్ళీ, పక్క వాటాలోకి వినపడుతుందేమోనన్న భయంతో తగ్గు స్థాయిలో తల్లికి నచ్చజెప్ప బూనుకున్నాడు.

"ఎందుకమ్మా అలాంటి మాట లంటావ్? ఇప్పుడు నువ్వు తింటున్నావని ఎవరంటున్నారు? మేము ఉండగా ఇంకొకరి పంచన చేరవలసిన ఖర్మేమిటి నీకు? కని పెంచిన దానివి, నీకు తెలియదా నా స్వభావం? ఈవేళ నీతో నేను సరిగా మాట్లాట్టం లేదని ఎలా అనుకుంటున్నావ్? నా పనులేవో నేను చూసుకోవటం తప్ప ఎవరితోనైనా, ఎప్పుడైనా — చివరికి నీతోగాని, దానితోగాని ఎక్కువగా మాట్లాడానా నేను? నీకన్నా నాకు భార్య ఎక్కువ కాదమ్మా! నేను పెళ్ళాం మాటలు విని తల్లిని దూరం చేసుకునేటంత మూర్ఖుణ్ణి కాదని ఎన్నిసార్లో చెప్పా న్నీకు. అయినా, మాటిమాటికీ ఆ మాటని న న్నెందుకు క్షోభ పెడతావ్? అసలు చీటికిమాటికి ఎందుకొస్తాయ్ మీకు తగాదాలు? కష్టమో, నిష్ఠూరమో తెచ్చి పడేసే వాణ్ణి నే నున్నాగదా? ఇందులో ఎవరికి తెలియకుండా ఎవరేం తింటున్నారని, ఏం చేస్తున్నారని? నీడ పట్టున కూర్చుని వండుకొని తినటానికి కూడా మీ కింత కష్టంగా ఉందా? పోనీ, అది నోటిదే అనుకో! పెద్దదానివి నువ్వు సర్దుకోకపోతే ఏ గొడవా రాదుగా! చెప్పి చెప్పీ నా నోరు పడిపోతున్నదే గాని, ఒక్కరు కూడా నా బాధ అర్థం చేసుకోరే? బయట నా మానమర్యాదలు సంగతి ఆలోచించరేం? మీ తగాదాలే మీకు ముఖ్యమా? పోయిన చోటల్లా పరువు పోగొట్టుకుని నలుగుర్లో 'ఛీ' అనిపించుకోవటమేనా మన బ్రతుకు? మన అదృష్టం బాగుండి, ఇక్కడ వీళ్ళేదో మన మీద 'అభిమానం చూపించి, చవకగా ఇల్లుకూడా అద్దెకిచ్చి ఆదుకుంటున్నారు! ఇక వాళ్ళ ముందు కూడా తలెత్తుకుని తిరిగే యోగం లేదా నాకు? ఇంట్లో చేరి నెల రోజులు కూడా కాలేదు! కొత్త చోటు, కొత్త మనుషులు అన్న ఇంగితమన్నా లేకుండా ఇంతలోనే ఏం కొంపలంటుకు పోతున్నాయని తగాదా పెట్టుకున్నారు? ఇట్లా అసహ్యంగా తగాదా లాడుకొని బయట ముఖం చూపించటానికి మీకుమాత్రం లజ్జ వెయ్యదూ? ఛీ! ఛీ! ఉండేకొద్దీ మీకు బుద్ధి, జ్ఞానం రెండూ నశిస్తున్నాయి!"

"అవరా, అను! నువ్విట్లా దాని ముందే నన్ను నిలేసి విలువలేకుండా మాట లడుగుతుండబట్టే కదూ దాని కంత అలుసై, మాట మాట్లాడితే మీద మీద కొస్తున్నది?" రుక్మిణమ్మకి దుఃఖం ముంచుకొచ్చి పైట కొంగుతో కళ్ళు తుడుచుకుంది.

"ఎందుకంత కడుపుకి కాని మాటలు! ఎంత ఇదైతే మాత్రం నేను మనిషి మీదికి పోతానా?" వెంటనే అందుకుంది జానకి.

ఇక సహించలేక పోయాడు వెంకట్రావు. "ఏయ్! ముందు నువ్వు



నోరు మూస్తావా, లేదా?" అని విరుచుకు పడ్డాడు భార్య మీద.

"అసలు నీకు జ్ఞానం లేదే ముందు! చదువుకున్నా వన్న మాటేగాని నీ కన్నా పశువు నయం! 'మనిషికొక మాట — గొడ్డుకొక దెబ్బ' అన్నారు. పెద్దది ఏదో అన్నా నోరుమూసుకోమని ఎన్నిసార్లు చెప్పాను నీకు? ఏం? ఎదురు సమాధానం చెప్పకుండా ఉంటే ఒళ్ళు చిల్లులు పడు తుందా? కాపురం గుట్టు కాపాడుకోవలసిన దెవరు? నామాటంటే లక్ష్యం ఉందా నీ కసలు? ఛీ! ఛీ! నా ఖర్మ కొద్దీ దొరి కారే మీరంతా!"

"అంతే! అంతే! తప్పుచెయ్యకపోయినా అటు ఆవిడ తిట్లు, ఇటు మీ తిట్లు అన్నీ నాకే! నా ముఖాన ఇంతే రాసి పెట్టుంది! నా పాడు బతుకింతే!"

జానకి పూర్తిగా ఏడుపు లంకించు కొని చరచరా వంటగది బయటికి నడి చింది. వెంకట్రావు ఇంకా అన్నంముందు కూర్చునే ఉన్నాడన్న స్పృహే ఉన్నట్టు లేదు!

మరొక్క క్షణం అక్కడ ఉన్నా పిచ్చెత్తేట్టుంది వెంకట్రావుకి! విండు కంచంలో చెయ్యి కడిగేసి గబగబ అంగలు వేసుకుంటూ వెళ్ళిపోయాడు బయటికి!

* * *

"వాళ్ళ సంభాషణ మాకు వినిపించ కూడదని వెంకట్రావు ఎంత జాగ్రత్తయ పడ్డా, మా కన్నీ స్పష్టంగానే వినిపిం చాయి.

ఏ విషయంలోనైనా బిడియం, సిగ్గు మొదటిసారికే! తరవాత అలవాటై పోతుంది. అలాగే మొదటి పర్యాయం తగాదా ఏర్పడ్డప్పుడు మాకు ముఖం చూపించటానికి అత్తా కోడళ్ళిద్దరూ కాస్త జంకినా, తరవాత తరవాత తరుచూ గొడవ పెట్టుకోవటం, మా ముందు నిర్లజ్జగా తిరగటం అలవా టైంది.

వాళ్ళిద్దరికీ ఏ విషయంలో సరిపడటం లేదో మా కర్థమయ్యేది కాదు. ఉన్న ట్టుండి రేగేదట జగడం. మొదలయ్యాం దంటే ఎవరూ ఎక్కడా సరిపెట్టుకునే వాళ్ళు కాదుట. నా భార్య చెప్పింది.

వాళ్ళ ప్రవర్తన పట్ల విరక్తివల్లనో ఏమో, వెంకట్రావు కూడా నోరు చేసుకోవటం మొదలెట్టాడు ప్రతిసారీ!

'నా ప్రాణానికి యమకింకరుల్లా దాప రించారే మీరు!' అని వాపోయే వాడు.

'మీ పోరు పడలేక ఏదో ఒక రోజున నేను దేశాలు పట్టి పోవటం ఖాయం!' అని బెదిరించేవాడు.

'మీరిద్దరూ చస్తే గాని నాకు శాంతి లేదు!' అని విరక్తి వెళ్ళగక్కే వాడు.

'నాకు చావైనా రాలేదు!' అని వైరాగ్యాన్ని వరించేవాడు.

చివరికి 'ఈ సారి మీరు తగాదా పెట్టుకుంటే మీ రిద్దరూ నా చావుని కోరినట్టే!' అని ఒట్టు పెట్టాడు.

అది బాగానే పనిచేసిన ట్టనిపించింది వాళ్ళమీద. ఆ దెబ్బతో వాళ్ళ నోళ్ళు శాశ్వతంగా కట్టుబడిపోతా యనుకున్నాడు. దాదాపు నెల రోజులు వాళ్ళింట్లో ఏ గొడవా జరగలేదు.

ఒక రోజు మధ్యాహ్నం మేమిద్దరం కలిసే ఇంటికొచ్చాం. ఆవరణలో అడుగు పెడుతూనే కథ మళ్ళీ మొదటికే వచ్చిన దృశ్యం కనిపించింది.

నాకైతే వాళ్ళిద్దర్నీ నరికి పోగులు పెట్టా లన్నంత కోపం వచ్చింది.

స్త్రీమీద చెయ్యి చేసుకోవటం సంస్కా రుల లక్షణం కాకపోవచ్చు. కాని, ఆ సన్ని వేశంలో అంతకన్నా భిన్నంగా ప్రవర్తించిన వాడు మహాత్ముడే అవుతాడు!

'ఛీ! మీదే ఒక ఆడజన్మే?' అని ఛీత్కరిస్తూ వెంకట్రావు వడివడిగా బయటకు వెళ్ళిపోవటం చూశాను.

అప్రయత్నంగానే నేనూ విడుస్తున్న బట్టలు అలాగే మళ్ళీ తొడుక్కొని అత న్ననుసరించాను.

చకచక నడుస్తూ కొద్దిదూరంలోనే అతన్ని కలుసుకున్నాను. హోటల్లో భోజనం చేద్దాం రమ్మని పిలిచాను. ఆకలిగా లేదని, ఎంత బతిమాలినా రానన్నాడు.

ఇలాకాదని, 'సరే, పదండి. నేనూ వస్తా ఆఫీసుకి' అని ముందు కదిలే శాను. గత్యంతరం లేక నా వెంట వచ్చి కాస్త ఎంగిలి పడ్డాడు. 'ఎంతో కొంత



ప్రశాంతి ఎక్కడ? ఫొటో—టి. పి. రెడ్డి (హైదరాబాదు)

ఒకరికి కడుపున పుట్టిన బిడ్డ! మరొకరికి మాంగల్యం నిలిపే భర్త! ఎవరైనా నిర్లక్ష్యం చేస్తారా ఆ ఒట్టుని? కాని, చేశారు వాళ్ళు! అయితే నిజంగా అతని చావుని కోరుకునే ఒట్టు మీరారని కాదు. వాళ్ళ కక్షలు, కార్పణ్యాల సారని దాటి ఆ ఒట్టు తీవ్రత వాళ్ళ మనసుల్లో నాట లేదు. అంత మూర్ఖత్వంలో ఉన్నారు వాళ్ళు!

నేను ఇంట్లో కెళ్ళి బట్టలు విప్పు తున్నాను. మాటా పలుకూ లేదు. వెంకట్రావు ఎవరినో ఎడాపెడా కొడుతున్న శబ్దం వినిపించింది! ఆ వెంటనే అతని భార్య ఏడుపూ వినిపిం చింది.

ఎంతటి సౌజన్యమూర్తి మహా న్నైనా పరీక్షకి పెట్టే సమయ మది! నస్తుండకుండా చేశాను", అని తృప్తి పడ్డాను. ఇద్దరం ఆఫీసు కెళ్ళాం.

కాని, వెళ్ళిన పది నిమిషాల్లోనే నా దగ్గరికొచ్చి 'ఈ పూటకి సెలవుపెట్టాను' అని చెప్పాడు. నేనూ సెలవు పెట్టి వస్తానని పైకి లేచాను. కాని 'దయచేసి ఈ పూటకి నన్ను వదిలేయండి!' అని ప్రాధేయపూర్వకంగా అన్నాడు.

అతని మనఃస్థితి నాకు తెలుసు. అలా ఒంటరిగా వదిలేయటమే మంచిదని నేను అతనితో వెళ్ళటానికి పట్టు పట్టలేదు. ఆఫీసు వదలగానే ఇంటికి వెళ్ళి మా ఆవిణ్ణి తీసుకొని వాళ్ళ భాగంలోకి వెళ్ళాను.

మా రాకకి, ముఖ్యంగా నా రాకకి వాళ్ళిద్దరూ విస్మయం చెందారు. ఎందు కంటే నే నెప్పుడూ వాళ్ళ భాగంలోకి వెళ్ళి ఉండలేదు. అంతేకాకుండా అప్పటి దాకా వాళ్ళ తగాదాల్లో నేనుగాని, నా భార్యగాని జోక్యం పెట్టుకోలేదు, సభ్యత కాదని. కాని, పరిస్థితులు విషమిస్తున్న ప్పుడు కూడా పట్టనట్టు ఉండటం సభ్యత కాదేమో? అందుకనే మేం చెప్ప వలసిన నాలుగు మాటలూ చెప్పివచ్చేశాం

అప్పుడైనా వాళ్ళు కళ్ళు తెరిస్తే బాగుండేది. కాని, అలా జరగలేదు. ఎప్పుడో వెంకట్రావు తీవ్రంగా మంద లించినప్పుడు కొంత ఎక్కువ కాలం మిన్నకుంటారు తప్ప వాళ్ళ స్పర్ధలు పూర్తిగా మాసిపోలేదు.

వెంకట్రావు ఇంట్లోగాని, బయట గాని ఎంత ప్రశాంతతని కోరేవాడో అందుకు అంతగా వ్యతిరేకంగా ఉండేది ఇంట్లో వాతావరణం. ఒక సారి మనసు కలతబడితే కొద్ది రోజులదాకా స్వస్థుడు కాలేడు. అంత సున్నితం అతని మనసు. కాని, అతను ఒక గాయం నించి తేరు కొనేటంతలో మనసుకి మరో గాయం తగిలేది. పర్యవసానంగా అత నెప్పుడూ ఏదో పోగొట్టుకొన్న వాడిలా, మంద కొడిగా తయారయ్యాడు.

రాను రాను అతనిలో తనని తాను కించ పరుచుకొనే తత్త్వం ఏర్పడి నాతో మాటలు కూడా తగ్గించేశాడు. ఏవిధం గానూ అతనికి సహాయం చెయ్యలేక పోతున్నాననే చింత నాకు ఉండేది.

అతని తత్త్వాన్ని బట్టే ఎందుకో ఈ ఊళ్ళో ఎక్కువ రోజు లుండడేమో ననిపించింది. ఒక రోజున నే నూహిం చిందే నిజమైంది. సుదూర ప్రాంతానికి అతనికి ట్రాన్స్‌ఫరైంది.

ఆఫీసు వాళ్ళు వీడ్కోలు సభ జరప బోతేససేమిరా వద్దనేశాడు. కనీసం నేనైనా హోటలుకి తీసుకెళ్ళి టిపి తినిపిద్దా మనుకున్నాను.

'మనసులో సంతోషం లేనప్పుడు విందులు, వినోదాలు ఆహ్లాదం కలిగి స్తాయా, నిశ్వం?' అని వారించాడు. కాకపోతే 'మనం మళ్ళీ ఎన్నాళ్ళకు కలుసు కుంటామో? అసలు కలుసుకుంటామో, లేదో? నేను రాత్రికే వెళ్ళిపోవాలి గదా? ఈ కాస్త సమయాన్ని వృథా చెయ్యట మెందుకు? కాసేపు ఆ పార్కులో కూర్చుందాం పద' అంటూ అటువైపు దారి తీశాడు.

స్నేహితులం విడిపోతున్నాం. అతను నాకు పట్టి స్నేహితుడే కాదు, ఆత్మీ యుడు కూడా! హృదయం బరువెక్కింది. మాటలు పెగిలి రావటం లేదు.

అతని స్థితీ అంతే. అంతకన్నా ఎక్కు వేమో? చివరికి తనే నోరు పెగల్చు కున్నాడు.

'విశ్వం! వెళ్ళిపోతున్నాను. నీ వంటి స్నేహితుడు ఇంతకు మునుపెప్పుడూ లభ్యం కాలేదు. ఇక ముందు లభించడు కూడా. అటువంటి నీతో ఎక్కువకాలం కలిసి ఉండే అదృష్టం లేదు నాకు... ఈ దీనుణ్ణి ఎప్పుడూ మరిచిపోవుకదూ?' అని దుఃఖపూరితమైన కంఠంతో పలుకుతూ నా చేతులు పట్టుకున్నాడు. అతని చేతులు వణుకుతున్నాయి.

ఏదో ఉద్విగ్నతతో నా శరీరం గగుర్పొడిచింది. 'నిన్ను మరిచిపోవటమా, రామ్!' అంటూ అతని హస్తాన్ని నొక్కాను. నా గొంతూ తడబడింది.

ఉన్నట్టుండి అతను నా నుంచి చేతులు లాగేసుకొని ముఖం వెనక్కి తిప్పుకొని, దుఃఖం శరీరాన్ని కుదిపేస్తుంటే బావురు మన్నాడు.

జివ్వుమంది నా హృదయం. మగవాడయి ఉండీ అతనలా విస్ఫోటంగా ఏడుస్తున్నాడంటే ఎన్ని అగ్ని పర్వతాలు అతని గుండెల్లో మరుగుతున్నాయో, ఎంత ఆవేదన మనసులో కరుడు గట్టుకుపోయిందో! ఆ క్షణంలో అన్నీ బ్రద్దలయాయి.

అతని దీనావస్థకి నా హృదయాన్నెవరో పిడికిళ్ళతో పిండినట్లైంది. గొంతులో ఏదో కొట్టుకులాడింది. అసంకల్పితంగా నా కళ్ళూ చెమ్మగిల్లాయి. అయితే, నేనతన్ని ఓదార్చే ప్రయత్నం చెయ్యలేదు. అతని హృదయ భారం తగ్గిపోవటాని కంతకన్నా మంచిమార్గం లేదు.

తనంతట తాను తేరుకునేదాకా నేనలాగే ఉండిపోయాను. తరవాత ఇద్దరికీ మాటలే కరువయ్యాయి.

కొంతసేపటికి అతను చేతిగడియారం చూసుకుని గబుక్కున పైకి లేచాడు. నేనూ చూసుకున్నాను. టైం ఎక్కువగానే గడిచింది. పైగా అతనికి ప్రయాణం ఉంది.

ఇద్దరం మౌనంగానే ఇంటికి నడక సాగించాం. ఇల్లు చేరుకొనే ముందుగా అతనొకటి కోరాడు.

'విశ్వం! వెళ్ళేటప్పుడు మళ్ళీ నిన్ను పిలిచి చెప్పలేకపోవచ్చు. అపార్థం చేసుకోకు. ఇదే కడసారి వీడ్కోలు' అంటూ నాతో కరచాలనం చేశాడు.

అంతే. అతను సామాను సర్దుకోవటం, రిక్షాలు పిలుచుకొచ్చి వాటిల్లో ఎక్కి వెళ్ళటం—అంతా తెలుస్తూనే ఉన్నా, నేను ఇంట్లోంచి బయటికి రాలేకనే పోయాను. ఆడవాళ్ళు మాత్రం తాళాలూ అవీ ఇచ్చి పుచ్చుకున్నారు.

ఆ పోవటం పోవటం ఒక జాబూ లేదు, జవాబూ లేదు. ఈ రోజుదాకా అతనెక్కడున్నాడో, ఏమయ్యాడో కూడా తెలియదు!" అని విశ్వనాథంగారు దీర్ఘంగా నిట్టూర్చారు.

రామచంద్ర ముఖం గంభీరంగా మారిపోయింది. విశ్వనాథంగారు తన కథనం ఆపినప్పటికీ, అతనేమీ మాట్లాడలేదు. కుర్చీలో వెనక్కి జారగిలబడి కూర్చుని ఉన్నాడు. ముక్తాయింపుగా మళ్ళీ విశ్వనాథంగారే అందుకున్నారు.

"ఇంతకీ నేను చెప్పొచ్చేదేమిటంటే, ఈ కుటుంబపు కలతల వల్లనే ఇళ్ళు నరకంగా తయారవుతున్నాయి. ఎందరో మనశ్శాంతికి దూరమై, వాళ్ళ సౌజన్యాన్ని కూడా కోల్పోయి కఠినాత్ములుగా మారిపోతున్నారు. వృద్ధిలోకి రావలసిన ఎందరో నిర్వీర్యులై పోతున్నారు. ఆ బహుమతి పొందిన కథ తరవాత మళ్ళీ వెంకట్రావు రచనలు నేను చూడలేదు. ఎందుకు రాయటం లేదని ఒకసారి నేనడిగితే ఏమన్నాడో తెలుసా? 'ఏం రాయను, విశ్వం? ఏ రోజూ సంతోషంగా ఇంట్లో అడుగు పెట్టలేను. ఏ పూట ఏం వినవలసి వస్తుందోనని బిడియం పీడిస్తుంటుంది, ఇంటిముఖం పట్టగానే. నా మనసు నిండా ఎప్పుడూ అవే ఆలోచనలు. వేరే ఆలోచనకి తావెక్కడిది?' అన్నాడు. చూశావా? కీర్తిశిఖరాల కెగబాకవలసిన అతని ప్రతిభ ఎలా అడుగంటి పోయిందో! అంతే. అలాంటి జీవితాలు ఎన్నటికీ పుంజుకోలేవు!" అంటూ మరొక నిట్టూర్పుతో ముగించారు విశ్వనాథంగారు.

రామచంద్ర అప్పుడుకూడా మౌనాన్ని వీడలేదు. అతని మనోఫలకంపై ఆవిర్భవించిన ఆలోచనా తరంగిణి ఫాలమైదానంపై పాయలుగా ప్రవహిస్తోంది.

"ఈ కథ నిన్ను బాగా కదిలించినట్టుందోయ్! సహజమే! సున్నితమనస్కులెవరైనా చలించే చరిత్రలే ఇవి!" అతని ఆలోచనని అవగతం చేసుకున్నట్టుగా అన్నారు విశ్వనాథంగారు.

"నిజమే, మాస్టారూ!" కుర్చీలో తిన్నగా కూర్చుని గాఢంగా నిశ్వసించి పలికాడు రామచంద్ర. "స్త్రీల అసూయా ద్వేషాలే వీటన్నిటికీ మూలకారణం! అయితే, విలువైన జీవితాలని ఆ అసూయ ద్వేషాలకి ఆహుతి కానివ్వకుండా వాటి స్థానే ప్రేమానురాగాలు పల్లవించే ప్రయత్నం చెయ్యాలి. అదొక్కటే పరిష్కారమార్గం!"

"పుట్టుకతో వచ్చిన బుద్ధి పుడకలతో గాని పోదన్నట్టు, గుణాలు మధ్యలో మారతాయంటే నాకు నమ్మకం లేదోయ్!"

"లేదు, మాస్టారూ! నా అనుభవంలోని రెండు సంఘటనలు వింటే మీకే నమ్మకం కలుగుతుంది."

"నీ స్వానుభవమా?" వింతగా చూశారు విశ్వనాథంగారు.

"అవును! మీ రనుకున్నట్టు మాది మొదట్నించీ కలతల్లేని కుటుంబం కాదు. అంతా చెప్పి మీకు శ్రమ కలిగించటం దేనికి? ఇప్పుడు మీరు చెప్పిన కథ మా కథకి అచ్చు మొదటి భాగం అనుకోండి. అదే కథ రెండో భాగంలోనూ పునరావృత్తమైంది. అంటే మా అమ్మ, నా భార్య— మా అమ్మ, నాన్నమ్మలాగే ఎప్పుడూ కీచులాడుకొనే వాళ్ళు. . ."

"ఏమిటీ! అమ్మాయి— సుశీల కూడానా?" నమ్మలేనట్టు అడిగారు విశ్వనాథంగారు.

రామచంద్ర మందహాసంతో—"ఆఁ! అక్షరాలా!" అంటూ కొనసాగించాడు.

"మీ మిత్రుడికి మల్లేనే ఉండేది నా స్వభావంకూడా. నేనూ ఈ గొడవలతో చాలా క్రుంగిపోయాను. ఇంట్లో ఏ విషయంలోనూ ఎవరికీ కొదవ చేసేవాణ్ణి కాదు. 'అయినా, ఎందుకు రగులుతూందో వీళ్ళ మధ్య ద్వేషం?' అని రాత్రింబగళ్ళు ఆలోచిస్తూ తల బద్దలు కొట్టుకొనే వాణ్ణి! చివరికి నే నొక అవగాహన కొచ్చాను."

ఆసక్తిగా చెవులప్పగించారు విశ్వనాథంగారు.

"ఒక సాయంత్రం నేను ఇల్లు చేరుకునేటప్పటికి వాళ్ళిద్దరి మధ్య వివాదం తారస్థాయిలో జరుగుతోంది. క్రితానికి మల్లే నేను కల్పించుకోలేదు. మౌనంగా స్నానం, భోజనం కానిచ్చాను. త్వరగా భోజనం చేయమ్మా అని మా అమ్మకి పురమాయించాను. ఒక పావు గంట దాకా ఆవిడ కూర్చున్న చోటు నించి కదల్లేదు. మళ్ళీ చెప్పాను—'లే, అమ్మా, త్వరగా అన్నం తిను. ఒక చోటికి వెళ్ళాలి' అని. ఎలా భావించిందో, ఏమో లేచి త్వరగా భోజనం ముగించి వచ్చింది. వెంట రమ్మని బయటికి నడిచాను. అడగలేక, అర్థంకాక మా ఆవిడ అయోమయంగా చూస్తూ నించుంది.

దారిపొడుగునా ఎవరమూ మాట్లాడుకోలేదు. రాములవారి కోవెల దగ్గిరికి తీసుకెళ్ళి అక్కడ రావిచెట్టు మొదట్లో ఉన్న అరుగు మీద కూర్చోమన్నాను.

అప్పుడు అడిగింది మా అమ్మ— 'ఎందుకురా ఇక్కడికి తీసుకొచ్చావ్?' అని.

'పురాణ కాలక్షేపం ఉంది. విందామని' అన్నాను.

'అయ్యో! ఎంత దయ కలిగింది ఈ నాటికి తల్లిమీద!' అంది కోపంగా. చుట్టుపక్కల ఎవరూ లేరు. ఆ మాటకి నాకు నవ్వొచ్చి స్వేచ్ఛగా నవ్వాను.

పురాణం మొదలవటానికి ఇంకా వ్యవధి ఉంది. జనం ఇంకా చేరుకోలేదప్పటికి.

వెన్నెల రాత్రి. అప్పుడప్పుడు గుడి లోపల ఘంటారావం, గాలికి రావి ఆకుల గలగలలు తప్ప మరో అలికిడి లేదక్కడ. మనసులోని మాలిన్యాన్ని ప్రక్షాళన చేసే ప్రశాంతత, ప్రకృతి రామణీయకత నెలకొని ఉన్నాయి. నా ప్రయత్నానికి అదే సరైన చోటుగా ఎంచుకొని తీసుకెళ్ళాను.

మా అమ్మ పక్కనే కుడిచేతి మీద పడుకొని 'అమ్మా' అన్నాను ఆర్ద్రంగా.

నా నవ్వు, పిలుపు తన అనుమానాలని ఎగరగొట్టాయేమో— 'ఏమిటి, రామూ?' అంది ఆప్యాయంగా.

'అమ్మా! మగవాడికి తల్లి, భార్య ఇద్దరూ రెండు కళ్ళు లాటి వాళ్ళు కదా? అవి కలిగితే అతడికి ఎంత బాధో, వేదనో ఆలోచించావా, అమ్మా?' అని ప్రశ్నించాను.

'కాదని ఎవ రన్నార్రా?' అంది.

'మరెందు కమ్మా, ఎప్పుడూ ఇద్దరూ తగాదా పెట్టుకుంటారు? మన మనసులు పాడవటమే కాకుండా, పది మందిలో ఎంత పలచనై పోతున్నాము?' అనడిగాను వేదనతోనే.

వెంటనే సమాధానం చెప్పలేదు మా అమ్మ. కొద్ది క్షణాల తరవాత అడిగింది— 'పెద్ద ముండని ఏదో అంటానే అనుకో! అదెందు కంత ఖస్సుమని లేస్తుంది?' అని.

'అంతేగదమ్మా! అంతకి మించి దానిలో చెడ్డ గుణా లేమీ లేవుగా! ఒళ్ళు దాచుకోకుండా అదెలా కష్టపడేదీ, అందరికీ అన్నీ ఎలా అమర్చి పెట్టేదీ నీకు తెలియదా, అమ్మా?' అనడిగాను.

'కాదని నే నన్నానట్రా?' అని ఒప్పుకుంది.

'మరి ఇక పేచీ ఎందు కమ్మా? కాకపోతే దానికి రోష మెక్కువ. మాట పడే తత్త్వం కాదు. దాని గుణాన్ని గ్రహించి నువ్వే సర్దుకుపోతే ఏ గొడవా రాదుగా?' అని సూచించాను.

మౌనంగా ఉండిపోయింది మా అమ్మ.

'నీకన్నా వయసులో చిన్నది. అనుభవం తక్కువ. తొందరపాటు ఎక్కువ. పెద్దదానివి గనక దాని మంచి చెడ్డలు, తప్పొప్పులు నువ్వే భరించి దాన్ని సరిదిద్దాలి.

అత్తవైనా, తల్లివైనా నువ్వే కదమ్మా? అదే మన ఇంట పుట్టిందైతే మనం వద్దనుకుంటామా? రేపు దానికీ చెబుతాను ... మీ రిద్దరూ అన్యోన్యంగా ఉండటమే నమ్మా నాకు కావలసింది! మీరు సంతోషంగా ఉంటేనే నాకూ సంతోషం, సగం బలం!. . .' అని ఇంకా ఏదొ అనబోతుంటే నా గొంతు గాద్గదిక మైంది.

మా అమ్మ హృదయంకూడా స్పందించిందేమో— 'అలాగే, నాయనా, నీ సంతోషంకన్నా నాకు మాత్రం కావలసిందేముంది?' అంది పశ్చాత్తాప పూర్వకంగా.

నా మనసెంతో తేలికైంది. అప్పటికి జనం చేరుకున్నా రక్కడికి. మరి కొద్ది సేపటికే పురాణం ప్రారంభమైంది.

పది నిమిషాలు పోయాక— 'రామూ! నా కెవరో ఒకరు తోడు దొరుకుతారు గాని, మువ్విద్దరూ— అమ్మా యొక్కతే ఉంది!' అంది మా అమ్మ.

జాగర్తగా రమ్మని చెప్పి, ఉప్పొంగే హృదయంతో ఇంటిముఖం పట్టాను.

అలాగే మర్నాటి సాయంత్రం సుశీలని తను చాలా సార్లుగా చూపెట్టమని అడుగుతున్న సముద్రతీరానికి తీసుకెళ్ళాను. మా ఊరికి పది మైళ్ళ దూరంలోనే ఉంది.

తీరాన్నే కొంత దూరం నడిచి ఎవరూ లేనిచోట కూర్చున్నాము. తన్మయంతో విస్మితవంతో చెప్పిందట సముద్రతీరానికి. సముద్రుడి అందాలని తన్మయత్వంతో తిలకిస్తూ ఉంది.

నేను చల్లగా తన ఒళ్ళోకి ఒరిగాను. తీయని అనుభూతితో నా జుత్తులోకి వేళ్ళు పోనిచ్చి మెత్తగా కళ్ళు మూసుకుంది.

'సుశీ!' అన్నాను మంద్రస్వరంతో.

'ఊఁ' అంది కళ్ళు మూసుకునే.

'నే నొకటి అడగనా?' అన్నాను.

'ఊఁ' అంది మళ్ళీ.


'నాకు కష్టం కలిగించటం . నీ ఇష్టమా?' అడిగాను.

కళ్ళు తెరిచి నా కళ్ళలోకి సూటిగా చూసి, 'మీకు తెలియదా?' అంది.

'తెలుసు. కాని, మా అమ్మ విషయంలో మాత్రం నాకు బాధ కలిగిస్తూనే ఉన్నావ్!' అన్నాను.

'నే నేం చేయను? నా మనసులో ఎటువంటి చెడు ఉద్దేశాలూ ఉండవ్. అంతా నావాళ్ళే అనుకుంటాను. అయినా, లేనిపోని కల్పించి మాట పోటీ మాట అంటుంటే, ఎంత చేసినా మెప్పు లేకపోతే ఎంతకని ఓర్చుకోగలను?' అంది బాధగా.

'నిజమే, సుశీ! కాని, మాటకి మాటని




సహ్యం పెంచుకోవటానికి మనం చదువు లేని వాళ్ళం కాదు. చదువుకున్నందుకు విజ్ఞత ఉపయోగించాలి. మా అమ్మ పెద్దది. సహజంగా ఆ వయసులో కొంత చిరుగుదల ఉంటుంది. నీకు బాధ కలిగించే మాటలు అంటుంటే అనవచ్చుకూడా. అయితే మాత్రం, నువ్వు కాస్త ఓర్పు చూపించ గలిగితే అసలు ఘర్షణకే అవకాశం ఉండదు. ఆ మాత్రం ఓర్పు అలవాటు చేసుకోక పోతే జీవితాన్ని సాఫీగా సాగించలేం. పెద్ద వాళ్ళెప్పుడూ చెడ్డవాళ్ళు కాదు! పెద్దవాళ్ళు మనం ఉన్నంత కాలం మనతో ఉండరు. వాళ్ళ మాట కాదనకుండా ఉంటే వాళ్ళకీ తృప్తి. అంతగా భేదాభిప్రాయం ఉంటే మంచిగా చెప్పి ఒప్పించాలి. అంతేకాని,

తాత్కాలికోద్రేకానికి లొంగిపోతే ఫలితం ఇంట్లో అశాంతి మాత్రమే. సుశీ! అన్ని విషయాల్లోనూ నాతో సహకరిస్తున్నావ్. కాని, ఈ ఒక్క విషయంలో మాత్రం ఎందువల్లనో నా బాధని అర్థం చేసుకోవటం లేదు. నిన్న మా అమ్మకి చెప్పాను. నా సంతోషమే తనకీ కావాలంది. ఇక నువ్వూ అమ్మకి అను

గుణంగా నడుచుకుంటే మన ఇంట్లో ఏటూ చింతలనేవి ఉండవు! సంతోషం వెల్లి విరుస్తుంది!' అని ప్రేమపూర్వకంగా నచ్చ జెప్పాను.

సుశీల కాసేపు మౌనంగా ఉండి, 'ఎప్పుడూ తగువు లాడుకోవటం నాకు మాత్రం సంతోషమా? ఎప్పటి కప్పుడు మీ మాట వినవందుకు నేను బాధపడుతూనే ఉంటాను. అయినా, అనవసరంగా మాటంటే మాత్రం సహించ లేక పోతున్నాను. అంతేగాని, అత్తమ్మని ఎలా చూసుకోవాలో నాకు తెలియదా? జరిగి పోయిందానికి నన్ను క్షమించండి. ఇంకెప్పుడూ మీ మనసు నొప్పించను' అంది వాగ్దానం చేస్తున్నట్టుగా.

తన పశ్చాత్తాపాన్ని సూచిస్తున్నట్టుగా రెండు కన్నీటిబొట్లు నా చెంప మీద పడ్డాయి. నా గుండె కలుక్కుమంది.

'ఛ! ఇదేమిటి, సుశీ! ఒకరి నొకరు సంపూర్ణంగా అర్థం చేసుకున్న ఈ శుభతరుణంలో కన్నీళ్ళా? ఛ ఛ!' అని వారిస్తూ నా హృదయానికి గాఢంగా హత్తుకొని. . .

సారీ, మాస్టారూ! అప్పట్నించీ నేను ఇద్దరికీ సన్నిహితంగా మెలుగుతూ వచ్చాను. ముభావంగా ఉండకుండా ఇద్దర్నీ ఎప్పుడూ పలకరిస్తూ, మంచి చెడ్డలు స్వయంగా విచారిస్తుండే వాణ్ణి. అందరం కలిసే భోజనం చేసే వాళ్ళం. ఏ విషయమైనా అంతా కలిసే చర్చించుకొనేవాళ్ళం. సినిమాల లాంటివాటికి ఇద్దర్నీ తీసుకెళ్ళేవాణ్ణి. తరవాత మా అమ్మ భక్తిరసప్రధానమైన వాటిని తప్ప సినిమాలే చూట్టం మానేసిందనుకోండి. ఆ విధంగా నా ప్రయత్నం ఘనవిజయం సాధించింది. మీరు నమ్మండి, నమ్మకపోండి— మళ్ళీ ఈ రోజుదాకా మా ఇంట్లో మనస్పర్థలు రాలేదు. ఇక్కడి కొచ్చే ముందే మా అమ్మ యాత్రాస్పెషల్లో పుణ్యక్షేత్రాలు చూట్టాని కెళ్ళింది" అంటూ ముగించాడు రామచంద్ర.

"చాలా బాగుందోయ్! నిజానికి వెంకటావుకి ఇలాంటి సలహా ఇవ్వాలని నాకూ తట్టలేదు. తరాలు మారుతున్న కొద్దీ అంతరాలుకూడా మారాలని నిరూపించావ్! వెంకటావుకూడా ఇలా తన జీవితాన్ని చక్కదిద్దుకో గలిగితే ఎంత బాగుండేదో? ఇక్కణ్ణుంచి వెళ్ళిన తరవాతనైనా వాళ్ళ సంసారం బాగుపడిందో, లేదో!"

"లేదు, మాస్టారూ! ఆయన జీవితం అలాగే గడిచిపోయింది. ఆ మనోవ్యథతోనే తనువు చాలించారు!"

"ఏమిటీ! వెంకటావు చని పోయాడా!" దిగ్భ్రాంతి చెందారు విశ్వనాథంగారు. ఆ వార్త ఆయనకి తీవ్ర మనస్తాపాన్ని కలిగించింది. కొద్ది సేపు నిశ్చేష్టులై ఉండిపోయి తరవాత మెల్లగా అడిగారు: "ఎన్నాళ్ళయింది?"

"ఏడేళ్ళు."

"ప్చ్! జీవితంలో ఎప్పుడో ఒకసారి మళ్ళీ కలుసుకోలేకపోతామా? అనే ఆశ ఉండేది. అదికూడా తీరిపోయిందన్న మాట!" అన్నారు దిగులుగా, నీరసంగా. అంతలోనే, ఏదో గుర్తు చేసుకున్నట్టు, "అవునూ — వెంకటావు నీ కెట్లా తెలుసు?" అడిగారు.

"వారు మా నాన్నగారు"

"ఏమిటీ! నువ్వు వెంకటావు కొడుకువా?" విశ్వనాథంగారి స్వరంతో విషాదాన్ని సాంద్రదోలి ఆ స్థానాన్ని ఆశ్చర్యం ఆక్రమించింది.

వంటలో సుశీలతో మాట్లాడుతూ కూర్చున్న శ్రీమతిని ఉద్దేశించి, "ఏమేవ్? ఇది విన్నావా?" అంటూ మురుసుగా పైకి లేచారు విశ్వనాథంగారు. ★